నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, గురువారం 5 సెప్టెంబర్ 2024 | JAGTIAL


## డ్యాంలకు జలకళ



జలకళను సంతరించుకున్న లోయర్ మానేర్ డ్యాం

కరీంనగర్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : మొన్నటిదాకా వెలవెలబోయి కనిపించిన జలాశయాలు ఇప్పుడు భారీ వర్షాలతో జలకళను సంతరించుకుంటున్నాయి. ఎత్తిపోయకున్నా.. ఎగువ నుంచి వస్తున్న వరదతో నిండుగా మారుతున్నాయి. భారీగా వస్తున్న ఇన్‌ఫ్లోతో శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు), దిగువ మానేరు జలాశయాలు క్రమంగా ఊపిరి పోసుకుంటున్నాయి. 27.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న మధ్యమానేరు జలాశయం బుధవారం రాత్రి 7గంటల వరకు 21.73 టీఎంసీలకు చేరింది. వరదకాలువతోపాటు మూలవాగు వరదతో ఇన్‌ఫ్లో 15,961 క్యూసెక్కులు అవుట్ ఫ్లో 9,850 క్యూసెక్కులు ఉన్నది. అలాగే గత నెల 24 వరకు కేవలం 5 టీఎంసీలతో కనిపించిన దిగువమానేరు జలాశయం (ఎల్‌ఎండీ) దాదాపు పది రోజుల్లోనే 18.074 టీఎంసీలకు చేరుకున్నది. దీనికి ప్రధాన నీటి వనరుగా ఉన్న మోయతుమ్మదవాగు భారీ వర్షాలతో ఉధృతంగా మారి 33వేలకుపైగా క్యూసెక్కుల వరద వస్తున్నది. ఇటు మధ్యమానేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి 3,300 క్యూసెక్కుల వదులుతుండగా, 24.034 టీఎంసీల సామర్థ్యమున్న ఎల్‌ఎండీ క్రమంగా నిండుగా మారుతున్నది. ఆయకట్టుకు నీళ్లివ్వడం కష్టతరమనుకున్న సమయంలో నీటి నిల్వ 18 టీఎంసీలకు పైగా చేరగా.. ఇప్పుడు గేట్లు ఎత్తే పరిస్థితి వరకు వచ్చింది. 23 టీఎంసీలకు చేరుకున్న తర్వాత దిగువ ఆయకట్టుకు నీళ్లిచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్న అధికారులు.. వరద ఉధృతి మరింత పెరిగితే ఏ క్షణంలోనైనా గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలేందుకు సిద్ధమవుతున్నారు.

# బడి పిల్లలకు పౌష్టికాహారమేది?

రాగిజావ, బెల్లం ముక్క బంద్

ప్రభుత్వ బడులపై సర్కారు చిన్నచూపు



రాగిజావ, బెల్లం

- విద్యార్థుల్లో బలం కోసం రోజూ అందించే రాగి జావ, బెల్లం ముక్క పథకానికి మంగళం
- సర్కారు సహకారం లేక తప్పుకున్న సత్యసాయి ట్రస్టు
- ఆగస్టు నుంచి నిలిచిన పంపిణీ
- ఇబ్బందుల్లో లక్షలాది మంది చిన్నారులు

బడి పిల్లల కడుపుమాడుతున్నది. సర్కారు నిర్లక్ష్యంతో నోటికాడి బుక్క ఎత్తిపోయింది. స్కూల్లో రోజూ ఉదయాన్నే అందే పౌష్టికాహారం దూరమైపోతున్నది. 'విద్యారంగాన్ని సంస్కరిస్తాం. విద్యాలయాలకు వన్నె తెస్తాం' అని ఇన్నాళ్లూ బీరాలు పలికిన కాంగ్రెస్ సర్కారు, పిల్లల ఆకలి తీర్చే రాగి జావ, బెల్లం ముక్క పోషకాహార పథకానికి మంగళంపాడింది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన సత్యసాయి ట్రస్టుతో సంయుక్తంగా కలిసి అందించలేమంటూ చేతులెత్తేసింది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ట్రస్టు సైతం సొంతంగా అమలు చేయలేమంటూ ఆగస్టు నుంచి పక్కకు తప్పుకోగా, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పథకాన్ని అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జగిత్యాల, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): 'విద్యా రంగాన్ని సంస్కరిస్తాం. ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తాం. సమీకృత గురుకులాలను నిర్మిస్తాం. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 గురుకులాలు కడుతాం' ఇలా సర్కారు మాటలు వింటే సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. కానీ, ఆచరణలోకి వచ్చే సరికి మాత్రం పరిస్థితి దారుణంగా ఉన్నది. బడి పిల్లలకు కనీసం ఉదయం పూట ఇచ్చే రాగిజావ, బెల్లం ముక్కను అందించలేని దుస్థితికి దిగజారిపోయింది. బడి పిల్లల్లో పౌష్టికాహారం లోపం పెరిగిపోతున్నదని ఎన్నో ఏండ్లుగా అంతర్జాతీయ సంస్థలు, భారతీయ ఆహార సంస్థ మొత్తుకుంటూ వస్తున్నాయి. దీంతో దేశంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అలాగే ప్రధాని పోషక అభియాన్ పథకాన్ని తెచ్చి బాలింతలు, గర్భిణులు, ఐదేండ్ల లోపు చిన్నారులకు కొన్నేళ్లుగా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ స్కూళ్ల పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలన్న ఉద్దేశంతో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు స్వచ్ఛందంగా రాగిజావ, బెల్లం అందజేయాలని నిర్ణయించింది. 2015 నుంచి 2022 దాకా జిల్లాకు 30వేల మంది పిల్లల చొప్పున ఏడు జిల్లాల్లో సొంత ఖర్చులతో రాగిజావ, బెల్లం అందజేస్తూ వచ్చింది. మార్కెట్‌లో ₹10 నుంచి ₹15 విలువ చేసే రాగిప్యాకెట్, అలాగే 10 గ్రాముల బెల్లం ప్యాకెట్‌ను పిల్లల్లో ఐరన్‌ను వృద్ధి చేసేందుకు, ముఖ్యంగా ఆడపిల్లలో హిమోగ్లోబిన్ పెంచేందుకు కొన్నేళ్లపాటు తమ స్థాయిలో పంపిణీ చేస్తూ వచ్చింది. రాగిజావ, బెల్లం పంపిణీతో కలుగుతున్న ప్రయోజనాలను గుర్తించిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ట్రస్టు సభ్యులతో సమావేశమై కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేయాలని కోరింది. ఈ క్రమంలో ట్రస్టు సభ్యులు 2022-23 విద్యా సంవత్సరంలో 10 జిల్లాల్లో నాలుగు లక్షల మంది పిల్లలకు పంపిణీ చేశారు. ఇంటి వద్ద అన్నం, అల్పాహారం తీసుకోకుండా వచ్చిన చిన్నారులకు పాఠశాలలో ఇచ్చే రాగిజావ, బెల్లం ఉపయోగపడేది. ఆ కొద్దిరోజులకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులందరికీ వర్తింపజేయాలని సర్కారు నిర్ణయించింది. అన్నపూర్ణ ట్రస్టు ఆధ్వర్యంలోనే చేపట్టాలని కోరింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో 20 లక్షల మందికి పైగా పిల్లలు అభ్యసిస్తున్నారని, వారందరికీ అందజేసే



జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో రాగిజావ పంపిణీ (ఫైల్)

స్థోమత తమకు లేదని ట్రస్టు పేర్కొనడంతో ప్రభుత్వం-స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ పథకాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. అందుకోసం ప్రభుత్వం ప్రధాని పోషక అభియాన్ కింద వచ్చిన ₹18 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో 2023 విద్యాసంవత్సరం జూన్ నుంచి ఏప్రిల్ 2024 విద్యా సంవత్సరం చివరి దాకా పిల్లలకు రాగిజావ, బెల్లం ప్యాకెట్లను ట్రస్టు అందజేస్తూ వచ్చింది.

### కొత్త సర్కారు మొండి చేయి

రాష్ట్రంలో ప్రభుత్వం మారడం బడిపిల్లల పాలిట శాపంగా మారింది. రాగిజావ, బెల్లం పంపిణీని అటకెక్కించింది. నిబంధనల ప్రకారం రాగి జావ, బెల్లం పంపిణీ కోసం ఏటా జనవరిలో ప్రభుత్వం నిధులను అంచనా వేసి, వాటికి అయ్యే మొత్తాన్ని కేటాయించాల్సి ఉంటుంది. బడ్జెట్ ఆమోదం తర్వాత జూన్‌లో విద్యా సంవత్సరం మొదలైన తర్వాత నిధులను నెల వారీగా.. లేదంటే విడుతల వారీగా స్వచ్ఛంద సంస్థకు విడుదల చేస్తూ ఉండాలి. నిధులు అందితేనే సత్యసాయి ట్రస్టు తమ వాటాను కలిపి రాగి జావ, బెల్లం పంపిణీని చేపడుతుంది. కానీ, ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పథకం నీరుగారిపోయింది. ఈ యేడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో విద్యాశాఖ అధికారులు, విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రయత్నించినా వీలు లేకుండా పోయింది. తర్వాత పలుసార్లు ప్రయత్నాలు చేసినా, కనీస స్పందన రాకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. 2024 జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం కాగా, నిధులు లేకపోవడంతో పథకాన్ని ఎలా కొనసాగించాలో తెలియక ట్రస్టు డైలామాలో పడిపోయింది. ప్రభుత్వం ఈ రోజు కాకపోతే రేపైనా స్పందిస్తుందన్న నమ్మకంతో తమ సొంత నిధులు వెచ్చించి జూన్, జూలైలో రాగిజావ, బెల్లం పంపిణీని యథావిధిగా అమలు చేసింది. కానీ, ప్రభుత్వం చేతులెత్తేయడంతో విధి లేని పరిస్థితిలో ఆగస్టు మొదటి వారం నుంచి పంపిణీని నిలిపివేసింది.

### ఇబ్బందుల్లో పిల్లలు

గతేడాది అక్టోబర్‌లో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సీఎం టిఫిన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించి, లాంఛనంగా అమలు చేశారు. అయితే అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ రావడం, కొత్త సర్కారు కొలువుదీరడంతో పథకం అటకెక్కింది. కాగా, ఇప్పుడు స్వచ్ఛంద సంస్థ-ప్రభుత్వం సంయుక్తంగా అమలు చేస్తూ వచ్చిన రాగిజావ, బెల్లం పంపిణీకి సర్కారు ఎగమనామం పెట్టింది. ప్రభుత్వ చర్యతో రాగిజావ, బెల్లం పంపిణీ నిలిచిన ఉమ్మడి జిల్లాలోని లక్షలాది మంది పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క జగిత్యాల జిల్లాలోనే 50వేల మందికిపైగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కాగా, ఈ విషయమై సత్యసాయి అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ సభ్యుడు మాట్లాడుతూ, తాము ఎంతగా ప్రయత్నించినా, ప్రభుత్వం స్పందించకపోవడం, సహకరించకపోవడంతోనే పథకాన్ని నిలిపివేసినట్టు చెప్పారు. కాగా, ఇప్పటికైనా స్పందించి పిల్లలకు రాగిజావ, బెల్లం అందజేసేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రాష్ట్ర ఉత్తమ బోధకులు వీరే

నేడు హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానం




కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జ్యోతినగర్/పెద్దపల్లి రూరల్/సిరిసిల్ల తెలంగాణచౌక్, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో బోధన, పరిశోధనల్లో ప్రతిభకు గాను రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులను ప్రభుత్వం ఎంపిక చేసింది. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో సన్మానంతోపాటు పురస్కారాన్ని ప్రదానం చేయబోతున్నది. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఉత్తమ బోధన , పరిశోధనలకుగాను యూనివర్సిటీ సోషియాలజీ డిపార్ట్‌మెంట్ హెఓడీగా డాక్టర్ కే పద్మావతి, యూనివర్సిటీ పరిధిలోని ఎస్సారార్ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బూర్ల నరేశ్ ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. విద్యార్థులకు మెలకువలతో కూడిన బోధన అందించడం, గతంలో సంచార ప్రయోగశాల ద్వారా జిల్లాలోని 102 హైస్కూళ్లలో తన సొంత ఖర్చులతో విద్యార్థులకు ఎగ్జిబిట్స్ నమూనాలు అందజేసినందుకుగాను గుర్తింపు దక్కింది. అలాగే పిల్లలకు బోధనతోపాటు సైన్స్, సామాజిక అంశాలపై పట్టుసాధించేలా చేస్తున్న కృషికిగాను సిరిసిల్ల ప్రభుత్వ బాలుర పాఠశాల సైన్స్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్ ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు దీక్ష పోర్టల్, ఐఎఫ్‌బీ ప్యానల్‌లకు డిజిటల్ కంటెంట్ తయారు చేయడంలో కీలక భూమిక పోషించి, టీ శాట్ చానల్ ద్వారా బ్రిడ్జి కోర్సులో డిజిటల్ తరగతులను బోధించడంతో పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం) మార రమేశ్ ఎంపికయ్యారు.

# పవర్ లూం క్లస్టర్‌ను మంజూరు చేయండి

- కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వినతి
- సానుకూలంగా స్పందించిన గిరిరాజ్ సింగ్



కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్‌కు వినతిపత్రం అందిస్తున్న బండి సంజయ్ కుమార్

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 4 : సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. దీంతోపాటు నేషనల్ హ్యాండ్లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమైన ముడిసరుకు (యార్న్ డిపో)ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముడి సరుకు ఖర్చుల కారణంగా నేతన్నలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని విన్నవించారు. బుధవారం ఢిల్లీలో గిరిరాజ్ సింగ్‌ను కలిసిన బండి సంజయ్ ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సిరిసిల్లలో పవర్ లూం క్లస్టర్‌ను ఏర్పాటు చేయడంవల్ల వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ముఖ్యంగా యంత్రాల ఆధునీకరణతోపాటు ఉత్పాదకతను, కార్మికుల మధ్య ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచుతుందన్నారు. నాణ్యమైన వస్త్రాలను అందించడంతోపాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. యార్న్ డిపో ఏర్పాటు వల్ల సిరిసిల్లలో నేత కార్మికులకు ముడి సరకులు సులభంగా తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ప్రస్తుతం నేత కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, పెరిగిన ఖర్చులతో ముడిసరుకులను కూడా కొనుగోలు చేయడం కష్టమైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీని 80 శాతానికి పెంచడంతోపాటు పావులా వడ్డీకే రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ విజ్ఞప్తికి జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు. యార్న్ డిపో ఏర్పాటుతోపాటు పవర్ లూం క్లస్టర్ మంజూరుపై చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 80 శాతం సబ్సిడీ, పావలా వడ్డీకే రుణాలు వంటి అంశాల అమలు సాధ్యాసాధ్యాలపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# 'గురుకుల' సిబ్బందిపై సర్కారు కత్తి

- పార్ట్‌టైం బోధన, బోధనేతర ఉద్యోగుల తొలగింపు!
- ఆగ్రహిస్తున్న సిబ్బంది
- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన
- బతుకులు ఆగం చేయొద్దని విజ్ఞప్తి



పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం సమర్పిస్తున్న గురుకులాల సిబ్బంది

గురుకుల స్కూల్ సిబ్బందిపై కాంగ్రెస్ సర్కారు కత్తిగట్టింది. పార్ట్‌టైం బోధన, బోధనేతర ఉద్యోగుల బతుకులను రోడ్డుపాలు చేసింది. రాష్ట్రంలోని ఖాళీలన్నీ భర్తీ చేస్తూ యువత కలలు సాకారం చేస్తున్నామని గొప్పలు చెప్పకుంటున్న రేవంత్ ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లోని ఆరు వేల మందిని తొలగించి పొట్టకొట్టింది. మంగళవారం గురుకులాల పాఠశాల కార్యదర్శి మౌఖిక ఆదేశాలు జారీ చేయడం, బుధవారం విధుల్లోకి తీసుకోకపోవడంతో బాధితులు మండిపడుతున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను ఆగం చేయొద్దని వేడుకుంటున్నారు. పెద్దపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి, పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

పెద్దపల్లి, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 267 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో దాదాపు 6వేల పార్ట్‌టైం బోధన, బోధనేతర సిబ్బంది ఏండ్లుగా పనిచేస్తున్నారు. వారిలో సబ్జెక్ట్ అసోసియేట్స్ పార్ట్‌టైం, పార్ట్‌టైం టీచర్లు, అసిస్టెంట్ కేర్ టేకర్లు, స్పెషల్ టీచర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, 33 సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్(సీవోఈ)లలో 216మంది సబ్జెక్ట్ అసోసియేట్స్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తుండగా, వారి కొలువులను ప్రభుత్వం ఎకాఎకిన తొలగించింది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కార్యదర్శి అలుగు వర్షిణి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. బుధవారం పాఠశాలలకు వెళ్లిన సిబ్బందిని లోపలికి అనుమతించకపోవడంతో ఉద్యోగులు కంగుతిన్నారు. తమ పొట్టకొట్టొద్దని, ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పోరుబాట పట్టారు. ప్రభుత్వం అకారణంగా ఉద్యోగాలు తొలగించిందంటూ పెద్దపల్లి జిల్లాలోని బాధితులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. తక్షణమే తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ శ్రీ హర్షకు వినతి పత్రాన్ని సమర్పించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వినతి పత్రాలను అందజేశారు.

## గెస్ట్, పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాల్సిందే

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



కార్పొరేషన్, సెప్టెంబర్ 4: గురుకుల పాఠశాలల్లో సుదీర్ఘంగా పనిచేస్తున్న గెస్ట్, పార్ట్ టైం ఉద్యోగులను కొనసాగించాల్సిందేనని, కొలువుల నుంచి తొలగిస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. గురుకులాల్లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని మృతి చెందిన ఘటనలు మరువక ముందే, ప్రభుత్వం గెస్ట్, పార్ట్ టైం ఫ్యాకల్టీలను తొలగించడం సరికాదన్నారు. పాతవారిని తొలగిస్తూ, కొత్త అభ్యర్థుల వద్ద ₹50వేల నుంచి ₹లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ఉన్నతాధికారులు అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలు వస్తున్నాయని, దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు అనాలోచిత నిర్ణయాలతో దాదాపు 2లక్షల మంది ఎస్సీ విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందని, 38ప్రతిభా పాఠశాలలు, 24క్రీడా అకాడమీలు, మ్యూజిక్ స్కూల్, సైనిక్ స్కూల్, మహిళా సైనిక్‌స్కూల్, కళాశాల, న్యాయ కళాశాల, 35ఒకేషనల్ కళాశాలలు మూతపడే ప్రమాదం ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



### రోడ్డున పడేయొద్దు

నేను పెద్దపల్లి బాలుర గురుకుల స్కూళ్లో 2016నుంచి వాచ్‌మెన్‌గా పని చేస్తున్న. ఉన్నట్టుండి ఒక్కసారిగా నన్ను ఉద్యోగానికి రావద్దని అంటున్నరు. నేనేం తప్పు చేసిన. నేను ఉద్యోగం చేయకపోతే నా కుటుంబం ఆగమైతది. దయచేసి నన్ను రోడ్డున పడేయద్దు. నేను వేరే పని చేయలేను. నాకు ఇందులోనే ఉద్యోగం కల్పించాలి.

**- బొడ్డు మల్లయ్య, వాచ్‌మెన్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (పెద్దపల్లి)**



### రెగ్యులరైజ్ చేయాలి

నేను రెండేండ్లుగా మంథని గురుకుల పాఠశాలలో టీజీటీ బయోలాజికల్ సైన్స్ బోధకుడిగా పనిచేస్తున్న. ఉన్నట్టుండి నన్ను బుధవారం విధులకు హాజరు కావద్దన్నరు. నాకు ఇద్దరు పిల్లలు. కొలువులోంచి తీసేయడంతో నా కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి. ఉద్యోగాల్లోకి తీసుకొని రెగ్యులరైజ్ చేయాలి.

**- అక్కపాక లింగయ్య, అధ్యాపకుడు (మంథని)**



మట్టి గణపతులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

## మట్టి గణపతులే మేలు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 4: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే గణపతుల వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, మట్టి ప్రతిమలే మేలు అని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ రహిత గణపతుల తయారీ కార్యశాలను ఏర్పాటు చేసి, కూరగాయలు, పసుపు, గోధుమపిండి, ఆకులతో అనేక మట్టి వినాయకులను తయారు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డీ సుజాత, డాక్టర్ జీ శ్రీలత, ఎన్ సంగీతారాణి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే గణపతుల వల్ల పర్యావరణానికి కలిగే నష్టంపై వివరించారు. కార్యక్రమంలో అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ టీ ప్రమోద్‌కుమార్, డాక్టర్ వీ వరప్రసాద్, డాక్టర్ ఎన్ వాసవి, కే రామచంద్రన్, జీ నీరజ, జమున, సునీత, జ్యోత్స్న, వాణి అధ్యాపక బృందం ఉన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ 28న



గాంధీ చౌక్, సెప్టెంబర్ 4: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల జడ్జి ప్రేమలత తెలిపారు. బుధవారం సిరిసిల్ల కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్షించారు. స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలన్నారు. ఇక్కడ సీనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్‌కుమార్, సృజన, జ్యోతిర్మయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పెంటం శ్రీనివాస్, సందీప్, సతీష్, డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు, ఎస్‌ఐలు ఉన్నారు.

◄ సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమలత




















